# నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి

I | హైదరాబాద్, శనివారం 13 ఏప్రిల్ 2024 | SANGAREDDY




సంగారెడ్డి జిల్లా కవేలిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, పక్కన ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్

## భవిష్యత్తు బీఆర్‌ఎస్‌దే..

- జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు
- ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- కవేలిలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం

కోహీర్, ఏప్రిల్ 12: జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పిలుపునిచ్చారు. శుక్రవారం జహీరాబాద్ పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా కవేలి గ్రామంలోని ఓ ఫంక్షన్ హాలులో కోహీర్ మండల బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ భవిష్యత్ అంతా బీఆర్‌ఎస్‌దే ధీమా వ్యక్తం చేశారు. ఎవరూ అధైర్య పడొద్దని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించినట్లుగానే ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను కష్టపడి గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు కలిసిమెలిసి ప్రచారంలో ముందుకు సాగాలన్నారు. ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీనిచ్చారు. బీఆర్‌ఎస్ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. సమావేశంలో బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

## 'గీతం' విద్యార్థులకు కొలువులు




గీతం వర్సిటీలో అచీవర్స్ డేలో పాల్గొన్న ప్రముఖులు

- స్కూల్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులకు సగటు రూ. 5.18 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ
- గీతంలో ఘనంగా విజేతల దినోత్సవం

పటాన్‌చెరు, ఏప్రిల్ 12: గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయం, హైదరాబాద్‌లోని కెరీర్ గైడెన్స్ సెంటర్ శుక్రవారం విజేతల దినోత్సవాన్ని (అచీవర్స్ డే) ఘనంగా నిర్వహించింది. ప్రాంగణ నియామకాల్లో ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలతో పాటు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించడానికి సీట్లు పొందిన అభ్యర్థులకు ప్రవేశ పత్రాలను అందజేసింది. 2023-24 విద్యా సంవత్సరంలో దాదాపు 180 దేశీయ, బహుళజాతి కంపెనీలు హైదరాబాద్ గీతం వర్సిటీలో ప్రాంగణ నియామకాలను నిర్వహించాయి. ఇందులో ఇప్పటి వరకు 150 కంపెనీలు బీటెక్, ఎంటెక్, బీబీఏ, బీకాం, ఎంబీఏ, బీ ఫార్మసీ, బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీఏ విద్యార్థులను ఎంపిక చేసినట్టు గీతం వర్గాలు తెలిపాయి. కొంతమంది విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసం కోసం దరఖాస్తు చేసుకుని, దేశవిదేశాలల్లోని ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో ప్రవేశార్హత సాధించినట్టు తెలిపారు. టెక్నాలజీ విద్యార్థులు రూ.15లక్షల వార్షిక వేతనం, మేనేజ్‌మెంట్ విద్యార్థులు రూ. 14.13 లక్షలు, సైన్స్ విద్యార్థులు రూ. 7.50 లక్షల చొప్పున గరిష్ట వార్షిక వేతనాలకు ఎంపికైనట్టు తెలిపారు. మొత్తం గీతం మేనేజ్‌మెంట్ విద్యార్థులు రూ. 7.50 లక్షలు, టెక్నాలజీ విద్యార్థులు రూ. 5.18 లక్షల సగటు వార్షిక వేతనాన్ని పొందినట్టు తెలిపారు. బీఎస్సీ చివరి ఏడాది విద్యార్థి రీతి దత్తా చౌదరి, ఐఐటీ జాయింట్ అడ్మిషన్స్ (జేఏఎం-2024)లో 333వ ర్యాంకు సాధించి, జాతీయస్థాయిలో గీతం విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాన్ని చాటి చెప్పింది. ఓ విద్యార్థి మైక్రోసాఫ్ట్‌లో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికై మొదట్లో రూ.1.25లక్షల సీటీసీని పొందగా, ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తయ్యాక రూ. 50లక్షల సీటీసీ పొందనున్నట్టు పేర్కొన్నారు. మరో ఇద్దరు విద్యార్థులు రూ. 50వేలతో ఇంటర్న్‌షిప్ పొందినట్లు చెప్పారు. కార్యక్రమంలో యాక్సెంచర్ టాలెంట్ అక్విజిషన్ ఉపాధ్యక్షుడు అమిత్ సిన్హా, ఎంపీహెచ్ ఏఎస్ఐఎస్ ఇండియా క్యాంపస్ లీడ్ జాషువ డేవిడ్, అరబిందో ఫార్మా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అన్షుమన్ శరన్ పాల్గొన్నారు.

## పొద్దుతిరుగుడు కొనుగోళ్లు షురూ..




గజ్వేల్ మార్కెట్‌లో పొద్దుతిరుగుడును తూకం వేస్తున్న హమాలీలు

గజ్వేల్, ఏప్రిల్ 12: 'నమస్తే తెలంగాణ'లో ఈనెల 10న ప్రచురితమైన 'కొనుగోళ్లేవి' కథనానికి స్పందించిన అధికారులు సిద్దిపేట జిల్లాలో పొద్దుతిరుగుడు కొనుగోళ్లను ప్రారంభించారు. పది రోజులుగా మార్కెట్‌లో రైతులు తీసుకొచ్చిన పొద్దుతిరుగుడు కొనుగోళ్లు నిలిచిపోవడంతో అధికారులు గోనె సంచులు తెప్పించి... కాంటాలు వేస్తున్నారు. గజ్వేల్ మార్కెట్‌లో శుక్రవారం కొనుగోళ్లను పీఏసీఎస్ ఆధ్వర్యంలో అధికారులు ప్రారంభించారు. దీంతో 'నమస్తే తెలంగాణ'కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## కేసీఆర్ హయాంలో పుట్లకొద్దీ వడ్లు..
# కాంగ్రెస్ పాలనలో పుట్టెడు దుఃఖం

- సాగునీరు, మద్దతుధర లేక అవస్థలు పడుతున్న రైతులు
- అబద్ధాలు చెప్పడంతో బీజేపీ బడేమియా, కాంగ్రెస్ చోటేమియా
- కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై.. బీఆర్‌ఎస్‌ను లేకుండా చేద్దామని చూస్తున్నయ్...
- తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసింది.. సిద్దిపేట గడ్డ
- మెదక్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ కంచుకోట
- సిద్దిపేట అభివృద్ధిని ఓర్వలేని వారికి ఓట్లు ఎలా వేద్దాం
- కాంగ్రెస్ మెడలు వంచాలంటే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలి
- మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- సిద్దిపేట పట్టణ బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం




సిద్దిపేట పట్టణ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 12: అసెంబ్లీ ఎన్నికల్లో తప్పుడు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మెడలు వంచాలంటే ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని కొండ భూదేవి గార్డెన్‌లో పట్టణ బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈ పార్లమెంట్ ఎన్నికలు బీఆర్‌ఎస్‌కు చాలా కీలకమన్నారు. పట్టువదలకుండా పోరాడి రాష్ట్రాన్ని సాధించామని, ఉద్యమానికి, గులాబీ జెండాకు ప్రాణం పోసింది సిద్దిపేట గడ్డ అన్నారు. తెలంగాణ కోసం మొదటి అడుగు వేసింది సిద్దిపేట అని, నాడు కేసీఆర్ సిద్దిపేట ప్రజలను నమ్ముకొని డిప్యూటీ స్పీకర్, తెలుగుదేశం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీచేస్తే ప్రజలు బ్రహ్మాండంగా గెలిపించి తెలంగాణ ఉద్యమానికి అండగా నిలిచారన్నారు. మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమేనని చెప్పారు. కాంగ్రెస్ మాటలు నీటి మూటలేనని, ప్రజలకు ఇప్పుడిప్పుడే అర్థమవుతుందన్నారు. నాలుగు నెలల్లోనే ఇంత ప్రజా వ్యతిరేకతను చూసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. వడ్లకు మద్దతు ధర అందించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. జనగామ మార్కెట్లో క్వింటాల్ వడ్లకు రూ.1560 కొనడం లేదన్నారు. 30 రోజులు కార్యకర్తలంతా కష్టపడి పనిచేస్తే విజయం మనదే అన్నారు. తెలంగాణ రావడం వల్లనే సిద్దిపేట జిల్లా అయిందని, రైలు, గోదావరి నీళ్లు వచ్చాయని హరీశ్‌రావు చెప్పారు. కాంగ్రెస్ పాలనలో వచ్చిన మార్పు ఏదైనా ఉందంటే సిద్దిపేటకు మంజూరైన పనులు, జరుగుతున్న వెటర్నరీ కాలేజ్‌ని రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు తరలించుకుపోవడం అన్నారు. రూ.150కోట్ల అభివృద్ధి పనులు నిలిపివేశారన్నారు. వీటన్నింటికీ సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. సిద్దిపేటకు అన్యాయం జరిగితే, అక్కసు వెళ్లగక్కితే ఊరుకుందామా అన్నారు. సిద్దిపేట ప్రజలందరం.. చీము, నెత్తురు ఉన్నోళ్లం, మళ్లీ కాంగ్రెస్‌కు ఓట్లువేసి మోసపోదామా అన్నారు.

### కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలో ప్రజలు ఆలోచించాలి..

అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేయకుండా, ఎన్నికల కోడ్ అని సన్నాయి నొక్కులు నొక్కుతున్న కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలో ప్రజలు ఆలోచించాలని హరీశ్‌రావు పేర్కొన్నారు. సిద్దిపేటకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదన్నారు. సిద్దిపేట అభివృద్ధిపై కాంగ్రెస్, బీజేపీలు అక్కసు వెళ్లగక్కుతున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాలించే సత్తా, సరుకు లేదని, అందుకే ఫోన్ ట్యాపింగ్ అని ప్రతిపక్షాలపైన బురద జల్లుతూ రాజకీయాలు చేస్తున్నాడన్నారు. కాంగ్రెస్ మీద కోపంతో బీజేపీకి ఓటు వేస్తే పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లు అవుతుందన్నారు. బీజేపీ సంక్షేమానికి, పేదలకు వ్యతిరేకమన్నారు. వడ్లు కొనమంటే నూకలు తినమన్న బీజేపీకి ఎట్లా ఓట్లు వేస్తామన్నారు. అబద్ధాలు మాట్లాడడంలో బీజేపీ బడేమియా అయితే కాంగ్రెస్ చోటేమియా అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై కుట్రలు చేస్తూ బీఆర్‌ఎస్‌ను లేకుండా చేద్దామని చూస్తున్నాయన్నారు. కేసీఆర్ హయాంలో తెలంగాణలో పుట్లకొద్దీ వడ్లు పండితే ..కాంగ్రెస్ 4 నెలల కాలంలో రైతులు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారన్నారు. సిద్దిపేటలో అనేక ఆలయాలను అభివృద్ధి చేశామని, కార్యకర్తలు ఏమరుపాటుగా ఉండొద్దన్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు దుబ్బాక ఉప ఎన్నికలో అబద్ధాలు చెప్పి గెలిచి నాలుగేండ్లు దుబ్బాకకు ఏమి చేయకపోవడంతో అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టి 50,000 మెజార్టీతో కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించారన్నారు. దుబ్బాకలో చెల్లని రూపాయి సిద్దిపేటలో ఎలా చెల్లుతుందన్నారు. గతంలో మెదక్ పార్లమెంటు స్థానంలో విజయశాంతిని గెలిపించిన చరిత్ర సిద్దిపేటన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై అనేక స్థానాల్లో డమ్మీ అభ్యర్థులను పెట్టారన్నారు. మైనార్టీలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని, బీజేపీని ఓడించే శక్తి బీఆర్‌ఎస్‌కు మాత్రమే ఉందని ముస్లింలు గుర్తించాలని మాజీమంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మెదక్ పార్లమెంటు స్థానం బీఆర్‌ఎస్ కంచుకోట అని, 2004 నుంచి 2024 వరకు బీఆర్‌ఎస్‌దే విజయమన్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన భవన నిర్మాణ రంగ కార్మికులు బీఆర్‌ఎస్‌కు మద్దతిచ్చిన ఏకగ్రీవ తీర్మాణాన్ని హరీశ్‌రావుకు అందజేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు, పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జంగిటి కనకరాజు, బీఆర్‌ఎస్ మహిళా పట్టణ అధ్యక్షురాలు టైగర్ నరసమ్మ, సీనియర్ నాయకులు వంగా నాగిరెడ్డి, బాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, పూజల వెంకటేశ్వరరావు (చిన్న), మోహన్ లాల్, ఎల్లు రవీందర్ రెడ్డి, లోక లక్ష్మీరాజ్యం, బుర విజయామల్లేశం, మాజీ మున్సిపల్ చైర్మన్ గట్టు అపర్ణాశ్రీనివాస్, మెరుగు మహేశ్, రజనీకాంత్‌రెడ్డి, రెడ్డి యాదగిరి, రెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీమంత్రి హరీశ్‌రావుకు ఏకగ్రీవ తీర్మాన పత్రం అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు





సిద్దిపేటలో సమావేశానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు

## అబద్ధాల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి



వెల్దుర్తి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- 120 రోజుల్లోనే పదేండ్లు వెనక్కి..
- బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
- ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- వెల్దుర్తిలో కార్యకర్తల సన్నాహక సమావేశం



వెల్దుర్తి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

వెల్దుర్తి, ఏప్రిల్ 12: అసెంబ్లీ ఎన్నికల్లో అమలుకానీ హామీలిచ్చి అబద్ధాలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం వెల్దుర్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వెల్దుర్తి, మాసాయిపేట మండలాల కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించగా సమావేశానికి ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 120 రోజులు దాటినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. రైతులకు చేస్తామన్న రుణమాఫీ, రూ.15వేల రైతు బంధు ఏమయ్యాయని, మహిళలకు నెలకు రూ.2,500 ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగడం లేదన్నారు. ఉద్యమాలతో సాధించిన తెలంగాణను మాజీ సీఎం కేసీఆర్ అభివృద్ధి పథంలో నడిపితే... ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుంటుపడిందన్నారు. పదేండ్ల కేసీఆర్ అభివృద్ధి పాలనకు, 120 రోజుల అబద్ధాల కాంగ్రెస్ పాలనకు ఉన్న వ్యత్యాసాలను ప్రజలు గమనించాలన్నారు. ఉద్యమాల గడ్డ మెదక్ గడ్డపై మరోసారి గులాబీ జెండా ఎగురవేయాలని, ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. వెంకట్రామిరెడ్డి ప్రతిఒక్కరికీ అందుబాటులో ఉండి సేవ చేస్తారన్నారు. కేసీఆర్ హయాంలో ఎకరా పంట కూడా ఎండిపోలేదని, ప్రస్తుతం 20లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాలతో పాటు తులం బంగారం ఇస్తామన్న హామీని కాంగ్రెస్ మర్చిపోయిందన్నారు. వారు ఇస్తామన్న తులం బంగారం పక్కనపెడితే.. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రూ.లక్ష సైతం ఇవ్వడం లేదని ఎమ్మెల్యే మండిపడ్డారు. రఘునందన్‌రావు దుబ్బాకలో చిత్తుగా ఓడిపోయారని, ఎంపీ ఎన్నికల్లో కూడా డిపాజిట్ దక్కదన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వెల్దుర్తి మండలంలో పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేశారని, వారికి రుణపడి ఉంటానని, ఏ సమయంలోనైనా కార్యకర్తలకు ఆపద వస్తే అందుబాటులో ఉండి, వారిని కంటిరెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు.



సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

### సేవచేసే భాగ్యం కల్పించండి
**– ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి**

ఎన్నికల్లో గెలిపించి.. ప్రజలకు సేవచేసే భాగ్యం కల్పించాలని ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కార్యకర్తలను కోరారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌గా 11 ఏండ్లపాటు ప్రజలకు సేవలు అందించానన్నారు. ఇక్కడి సమస్యలపై పూర్తిగా అవగాహన ఉందని, ఎంపీగా గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వెల్దుర్తి మండలంలోని మేల్లూరు పోచమ్మ తల్లి సాక్షిగా గెలిచిన 90 రోజుల్లో రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి నిరుపేదల కుటుంబాల విద్యార్థులకు ఉచిత కోచింగ్, వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడంతోపాటు, నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌లో ప్రతి ఆరునెలలకు ఒకసారి జాబ్‌మేళా ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీనిచ్చారు. మహిళలకు సైతం కుట్టుమిషన్, స్వయం ఉపాధి శిక్షణ అందిస్తామన్నారు. నెల రోజులు తన వెంట నడిచి గెలిపిస్తే జీవిత కాలం మీ వెంటే ఉంటానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. తెలంగాణను దేశంలో మొదటిస్థానంలోనిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆయన చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని వెంకట్రామిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, నాయకులు చంద్రగౌడ్, సింగాయిపల్లి గోపి, వెల్దుర్తి, మాసాయిపేట మండలాల అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను నమ్మొద్దు

- కులం పేరుతో ఒకరు, మతం పేరుతో మరొకరు...
- ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలి
- బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రం సుభిక్షం
- బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- దౌల్తాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం




దౌల్తాబాద్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

హత్నూర, ఏప్రిల్ 12: ఎన్నికలు వచ్చాయంటే చాలు ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకోవడానికి వచ్చే పార్టీలను నమ్మి మోసపోవద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి, అధికారం చేపట్టాక పథకాల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. నేడు ప్రజలు, రైతులు అవస్థలు పడుతుంటే సమస్యలు గాలికి వదిలేసి మళ్లీ కొత్త నినాదంతో కాంగ్రెస్ నాయకులు ప్రజలను ఓట్లు అడగటానికి వస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల హామీలు మర్చిన కాంగ్రెస్‌కు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. మతం పేరుతో ఒకరు, కులం పేరుతో మరొకరు ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని, అలాంటి పార్టీలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గతంతో కలెక్టర్‌గా చేసిన అనుభవంతో ప్రజల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తి అని, అలాంటి విద్యావేత్తను పార్లమెంట్‌కు పంపిస్తే ప్రజల గొంతుకగా ప్రభుత్వాలను నిలదీసి ప్రజల పక్షాన నిలబడతాడని తెలిపారు.

### సేవ చేయడానికే ప్రత్యక్ష రాజకీయాల్లోకి..

ప్రజాసేవ చేయడానికే ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజా సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కరిస్తానని మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. తన కుటుంబీకుల సహకారంతో రూ.100కోట్లతో ప్రజలకు సేవా కార్యక్రమాలు చేయడానికి ముందుకొచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గానికి ఫంక్షన్ హాల్ నిర్మాణంతో పాటు విద్యార్థులకు నైపుణ్య శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. కేసీఆర్, హరీశ్‌రావు ఆశీస్సులతో గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీపీ నర్సింహులు, దేవేందర్‌రెడ్డి, చంద్రాగౌడ్, గోపి, హరికృష్ణ, దామోదర్‌రెడ్డి, శివశంకర్ రావు, రవికుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు